

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 9 మార్చి 2025







ముంపు మళ్లింపు

కొండవీటివాగు వరద జలాలను ఎగువ, దిగువ ప్రాంతాలకు మళ్లించే పథకం ప్లాను

రాజధాని అమరావతికి అతిపెద్ద సవాల్‌గా వరద ముంపును చిత్రీకరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణాన్ని సంక్లిష్టంగా మార్చేసింది. అమరావతికి లేని ముంపు సమస్యను భూతద్దంలో రుణదాతలకు చూపుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులు కొందరు అడ్డంకులు సృష్టిస్తూనే ఉన్నారు. వాటిని అధిగమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన దృఢచిత్తంతో రాజధాని నిర్మాణ పనులను ముందుకే తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు సుమారు రూ.3 వేల కోట్లకు పైగా వ్యయంతో రెండు దశల్లో పనులను చేపడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు హయాంలో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా తీసుకుంటున్న చర్యలతో అమరావతికి వరదముంపు నుంచి శాశ్వత రక్షణ లభించినట్లే. ప్రత్యర్థి పార్టీ కుట్రపూరిత ఆలోచనల ఫలితంగా.. అనివార్యంగా చేపట్టాల్సి వస్తున్న వరదముంపు నివారణ పనులతో అమరావతి నగరం మరింత సుందరంగా ఆకర్షణీయంగా రూపుదిద్దుకోబోతుంది.

- రాజధానిలో వరద నివారణ చర్యలు
- రూ.3 వేల కోట్లతో రెండు దశల్లో పనులు
- ప్రత్యర్థి పార్టీ నేతల కుట్రలతో పటిష్ఠ చర్యలు
- తొలిదశలో కొండవీటివాగు, పాలవాగు అభివృద్ధి
- వరద నివారణతో ఆకర్షణీయంగా అమరావతి నగరం

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతికి కృష్ణానది వరదలతో ఎటువంటి ముప్పులేదు. గత వందేళ్ల చరిత్ర చూసినా ఇది తేటతెల్లమవుతోంది. ఎగువన నదికి ఇరువైపులా కరకట్టలు ఉన్నాయి. గత టీడీపీ పాలనలో కొండవీటివాగు వరదపై అవగాహన తో అప్పటి సీఎంగా చంద్రబాబు 2018లోనే ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతిని ఉక్కుపాదంతో తొక్కేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతిపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ప్రతిపక్ష పార్టీల పెద్దలు అమరావతికి వరదముంపు ఉందని రుణాలను ఇచ్చే సంస్థలకు పదేపదే ఫిర్యాదులను పంపుతున్నారు. ఆయా ఫిర్యాదుల నేపథ్యంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ఇస్తున్న సలహాలు, సూచనలతో కూటమి ప్రభుత్వం అమరావతిలో మరిన్ని వరద ముంపు నివారణ చర్యలను అనివార్యంగా మరింత పటిష్ఠవంతంగా చేపట్టాల్సి వచ్చింది. దీంతో కొండవీటివాగు, పాలవాగుతో పాటు గ్రావిటీ కెనాళ్ల కాల్వలను బ్రహ్మాండంగా వినియోగించుకోబోతున్నారు. దీంతో రాబోయే రోజుల్లో ప్రళయం ముంచుకొచ్చినా అమరావతికి ఎలాంటి ఢోకా ఉండబోదు.. సరికదా పర్యాటకంగా ఇవన్నీ అందర్నీ ఆకట్టుకుని ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకంగా మారనున్నాయి. సుందరమైన జలాశయాలు, గ్రావిటీ కెనాల్స్ నిర్మాణ పనులతో నగరమంతా బ్లూగ్రీన్ సిటీగా మారబోతుంది.

రెండు భాగాలుగా విభజన.. రెండు దశల్లో పనులు

అమరావతి నగరాన్ని కొండవీటి వాగు ఎగువ పరీవాహక ప్రాంతం, దిగువ పరీవాహకప్రాంతమనే రెండు భాగాలుగా విభజించి రెండు దశలుగా వరద ముంపు నివారణ చర్యలను చేపట్టనున్నారు. రెండు దశల పనులను సమగ్రంగా చేపడితే ప్రపంచంలోనే అమరావతి అత్యంత సురక్షిత ప్రదేశంగా నిలిచిపోతుంది. పైగా ఆరు రిజర్వాయర్‌ల ఏర్పాటుతో నగర ప్రజల తాగునీటి అవసరాలు కూడా పుష్కలంగా తీరుతాయి. ముంపు నివారణ చర్యలను ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు అందజేస్తున్న రుణం నుంచి చేపడుతున్నారు. ఈ మొత్తం వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ యంత్రాంగం విపత్తుల నిర్వహణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రిజర్వాయర్లలో హెచ్చుతగ్గులను నియంత్రిస్తూ ఎత్తిపోతల పథకాలను అవసరాన్ని బట్టి వినియోగిస్తుంటాయి. తద్వారా రాజధాని అమరావతిలో వరదలు తలెత్త కుండా చర్యలు తీసుకుంటారు.

- మొదటి దశలో కొండవీటివాగు దిగువ పరీవాహక ప్రాంతంలో నివారణ పథకం పనులను చేపట్టనున్నారు. ఈ పథకం తొలినుంచి అనుకుందే అయినా తాజాగా దీనిని మరింత విస్తృతస్థాయిలో చేపట్టనున్నారు. తొలిదశ పనుల కింద చేపట్టేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీఎల్) గత జనవరిలో టెండర్లను ఆహ్వానించింది. కొండవీటివాగు, పాలవాగు విస్తరణ, శాఖమూరు రిజర్వాయర్ నిర్మాణానికి రూ.462.26 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ ఒక టెండర్‌ను పిలిచారు. గ్రావిటీ కెనాల్, కృష్ణాయపాలెం రిజర్వాయర్ నిర్మాణానికి రూ.303.73 కోట్ల వ్యయంగా అంచనా వేస్తూ మరో టెండర్‌ను ఆహ్వానించారు. నీరుకొండ రిజర్వాయర్ నిమిత్తం రూ.470.75 కోట్ల అంచనాతో మరో టెండర్‌ను పిలిచారు. ఉండవల్లి వద్ద ప్రస్తుతం ఉన్న ఎత్తిపోతల పథకం పక్కనే కొత్తగా 7360 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు మరో ఎత్తిపోతలను కూడా నిర్మించాలని ప్రపంచబ్యాంకు చేసిన సూచనను కూడా పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. దీనికి సుమారు రూ.300 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉంది.

> శాఖమూరులో 50 ఎకరాల విస్తీర్ణంలో 0.03 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా, నీరుకొండలో 440 ఎకరాల్లో 0.43 టీఎంసీల నీటిని నిల్వచేసేలా, కృష్ణాయపాలెంలో 190 ఎకరాల్లో 0.09 టీఎంసీల నీటిని నిల్వచేసేలా చెరువులను నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

- అనంతవరం నుంచి వయా శాఖమూరు, నీరుకొండ, కృష్ణాయపాలెం రిజర్వాయర్ల మీదగా ఉండవల్లి వరకు 23.6 కిలోమీటర్ల పొడవున్న కొండవీటివాగును, బోరుపాలెం నుంచి కొండమరాజుపాలెం మీదగా కృష్ణాయపాలెం రిజర్వాయర్ వరకు ఉన్న పాలవాగును లోతు చేసి విస్తరించనున్నారు.
- కొత్తగా నెక్కల్లు నుంచి తుళ్లూరు, అనంతవరం, పిచ్చుకలపాలెం వరకు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా గ్రావిటీ కెనాల్‌ను ఏర్పాటుచేయనున్నారు.
- రెండోదశలో కొండవీడు కొండల నుంచి వచ్చే వరద నీటిలో కొంత భాగాన్ని లాం వద్ద నుంచి పెదపరిమి మీదగా వైకుంఠపురం వైపు దారిమళ్లించనున్నారు. ఇందుకోసం లాం, పెదపరిమి, వైకుంఠపురంల వద్ద మూడు వేర్వేరు రిజర్వాయర్లను నిర్మించనున్నారు. వీటిని అనుసంధానిస్తూ గ్రావిటీ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అవసరమైతే ఈ కెనాల్‌పై మినీ ఎత్తిపోతల పథకాలను మూడింటిని ఏర్పాటుచేసేలా డిజైన్ చేస్తున్నారు.
- చివరగా వైకుంఠపురం రిజర్వాయర్ నుంచి కృష్ణానదిలోకి మిగులు వరద జలాలను ఎత్తిపోసేందుకు 5650 క్యూసెక్కుల సామర్థ్యంతో భారీ ఎత్తిపోతలను ఏర్పాటు చేయనున్నారు.



కొండవీటివాగు మొత్తం పరివాహక ప్రాంతం

వేసవి కార్యచరణకు.. రూ.9.29 కోట్లు

- ప్రభుత్వానికి మున్సిపాల్టీల ప్రతిపాదనలు
- ట్యాంకర్ల ద్వారా పట్టణాల్లో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- ప్రభుత్వం నుంచి నిధుల కోసం పురపాలకుల ఎదురుచూపు
- పల్నాడు జిల్లాలో పలు మున్సిపాల్టీల్లో రెండు రోజులకు ఒకసారే తాగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


ఎండలు మండుతున్నాయి.. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మున్సిపల్ కేంద్రాల్లో తాగు నీటి సరఫరా కష్టంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు వేసవి కార్యచరణతో మున్సిపాలిటీలు సిద్ధమయ్యాయి. తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి అవసరమైన పురపాలకులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించారు. ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సర ఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి పథకాల మరమ్మతులకు సిద్ధమయ్యారు. వేసవి ప్రణాళిక అమలుకు రూ.9.29 కోట్లు అవసరమని మున్సిపాల్టీలు ప్రభుత్వానికి ప్రతిపాదలను పంపాయి. అయితే ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీల్లో ప్రస్తుత నీటి సరఫరా, వేసవి లో తలెత్తే సమస్యలను అధికారులు గుర్తిం చారు. వేసవిలో వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల పట్టణాలు ఏటా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుతం ఆయా పట్టణాల్లో పూర్తిస్థాయిలో నీటి సర ఫరా జరగడంలేదు. ఈ పట్టణాల్లో రెండు రోజులకు ఒక సారి నీటి సరఫరా చేస్తున్నారు. మూడు జిల్లాల్లో ఒక్క నరసరావుపేటలో మాత్రమే రోజూ రెండు పూటల పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది. మంగళగిరి, తాడేపల్లి, అద్దంకి, చీరాల, బాపట్ల రేపల్లె మున్సిపాల్టీల్లో రోజూ నీటి సరఫరా జరుగుతోంది. గుంటూరు, తెనాలి, పొన్నూరు, సత్తెనపల్లి మున్సిపాల్టీల్లో రోజూ ఒక పూట నీటి సరఫరా చేస్తున్నారు. గురజాల మున్సిపాల్టీలో 69 రోజులకు, చిలకలూరిపేటలో 79 రోజులు, వినుకొండలో 67 రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటి నుంచే నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పైపులైన్లు తదితర మరమ్మతుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం పురపాలకులు ఎదురుచూస్తున్నారు. చిలకలూరిపేట మున్సిపాల్టీలో రూ.1.15 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించగా అందులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూ.30 లక్షలు అవసరమని పేర్కొన్నారు.

ప్రతిపాదనలు ఇలా..

మున్సిపాల్టీ	నిధులు
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	రూ.1.62 కోట్లు
చిలకలూరిపేట	రూ.1.15 కోట్లు
వినుకొండ	రూ.70 లక్షలు
మాచర్ల	రూ.1.19 కోట్లు
గురజాల	రూ.30 లక్షలు
దాచేపల్లి	రూ.40 లక్షలు
పిడుగురాళ్ల	రూ.30 లక్షలు
సత్తెనపల్లి	రూ.15 లక్షలు
గుంటూరు జిల్లా	
పొన్నూరు	రూ.44 లక్షలు
తెనాలి	రూ.52.50 లక్షలు
మంగళగిరి-తాడేపల్లి	రూ.80 లక్షలు
బాపట్ల జిల్లా	
బాపట్ల	రూ.25 లక్షలు
అద్దంకి	రూ.21.50 లక్షలు
చీరాల	రూ.37 లక్షలు
రేపల్లె	రూ.88 లక్షలు

ముందస్తుగా మేల్కోవాలి..

ఈ ఏడాది నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పురపాలకులు ముందుస్తుగా మేల్కోవాలి. ఈ నెలాఖరు వరకు కాల్వల కు నీటి సరఫరా జరగనుంది. దీంతో మున్సిపాల్టీల చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టకుంటే పట్టణ ప్రజలగొంతెండటం ఖాయం.



- కల్తీకారం తయారీకి సిద్ధంగా ఉన్న నాసిరకం మిర్చి

- కొండల మాటున యథేచ్ఛగా తయారీ
- ఇరవై రోజుల క్రితమే స్థానికుల ఫిర్యాదు
- కన్నెత్తి చూడని అధికారులు..
- టన్నుల కొద్దీ తరలింపు

పేరేచర్లలో కల్తీకారం కర్మాగారం

మేడికొండూరు మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం అంటే ఓ బ్రాండ్. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు నాసిరకం కారం తయారీ చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. మిరపకాయల తొడిమలు, రంగు మారిన కాయలు, వాటి విత్తనాలతో పొడిని తయారుచేసి దానికి రంగు, రసాయనాలు కలిపి నాణ్యమైన కారాన్ని తలదన్నేలా కల్తీకారాన్ని తయారు చేసి టన్నుల కొద్దీ తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో కల్తీ కారం తయారవుతుంది.. అధికారులు తెలుసు కోలేరు అనుకుంటే పప్పులో కాలేసినట్లే. గుంటూరు నగరానికి సమీపంలో మేడికొండూరు మండలం పేరేచర్ల కొండ ప్రాంతంలోనే కల్తీకారం కర్మాగారం ఏర్పాటు చేశారు. గుంటూరులోని కొన్ని పరిశ్రమల్లో మిర్చి కాయల నుంచి వేరు చేసిన తొడిమలను సేకరించి ఇక్కడకు చేరుస్తున్నారు. రాత్రి వేళల్లో భారీ యంత్రాలను ఉపయోగించి పనికిరాని కాయలను, తొడిమలను యంత్రాల్లో వేసి పొడిగా తయారు చేస్తున్నారు. ఆ పొడికి రసాయనాలు, వెల్లుల్లి వేస్ట్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటివి కలిపి స్వచ్ఛమైన కారంగా, చూడటానికి ఎంతో నాణ్యంగా కనిపించేలా తయారు చేస్తున్నారు. గన్నీ బ్యాగులలో ఈ కారాన్ని గుంటూరులోని గోడౌన్లకు తరలించి అక్కడ కేజీ నుంచి వంద గ్రాములు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొన్ని కంపెనీల బ్రాండ్ల పేరుతో కూడా ఈ కారాన్ని ప్యాక్ చేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ కల్తీ కారం గుంటూరు సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణకు తరలిస్తున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, కర్రీ పాయింట్లలో వినియోగంతో పాటు చిల్లర దుకాణాల్లోనూ విక్రయిస్తున్నారు. కల్తీకారం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా సంబంధిత కల్తీ నిరోధక శాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.22 (ఆదివారం)
సహరి : 5.04 (సోమవారం)

నాసిరకం విత్తనాలు...

ఇక్కడ కల్తీ కారంతో పాటు నాసిరకం విత్తనాలు కూడా తీస్తున్నారు. కొన్ని రకాల మిర్చి కాయలను ఎంపిక చేసుకుని యంత్రాల ద్వారా విత్తనాలను తీస్తున్నారు. ఈ విత్తనాలకు కొంత మంచి విత్తనాలను కలిపి రైతులకు విక్రయిస్తారని సమాచారం. విత్తనాలు తీయగా మిగిలిన కాయలను, తొడిమలను పొడిగా చేసి కారం తయారీకి వినియోగిస్తున్నారు.

కళ్ల మంటలతో అల్లాడుతున్న ప్రజలు

మిర్చి తొడిమలను పొడిగా చేయాలంటే విపరీతంగా కోరు వస్తుంది. దీంతో కొండల మధ్య జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని కర్మాగారం ఏర్పాటు చేశారు. కొండల ప్రాంతంలో జనసంచారం లేని ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఏపుగా పెరిగిన చెట్ల మధ్య భారీ యంత్రాలను ఏర్పాటు చేసి కారం తయారు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటలకు మొదలుపెట్టి ఉదయం 6లోపు ముగిస్తున్నారు. అప్పటి వరకు తయారు చేసిన కల్తీకారాన్ని మినీ లారీలలో లోడ్ చేసి గుంటూరులోని గోడౌన్లకు తరలిస్తున్నారు. తెల్లవారగానే జనరేటర్లు, యంత్రాలపై పట్టాలు కప్పి ఏమీ తెలియనట్లు వెళ్లిపోతున్నారు. ఆరు గంటల తర్వాత పేరేచర్ల గ్రామ ప్రజలకు కళ్ల మంటలు వస్తున్నాయి. తొలుత ఈ కళ్లమంటలకు కారణం తెలియక అయోమయంలో పడ్డారు. ఇటీవల కొందరు గ్రామస్తులు కొండల ప్రాంతంలో పరిశీలించగా మిర్చి బస్తాలు, తొడిమలు, పట్టాలు కప్పి ఉన్న యంత్రాలను గుర్తించారు. ఇరవై రోజుల క్రితం దీనిపై మేడికొండూరు పోలీసులతో పాటు పంచాయతీ కార్యాలయం లో నూ ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకు ఆయా అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మూడొంతెనల కింద రయ్..రయ్

- ఆర్‌యూబీని ప్రారంభించిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- 60 అడుగులకు డొంకరోడ్డు విస్తరణ : కేంద్ర సహాయ మంత్రి
- రోడ్లపై దేవాలయాలు, మసీదులు, చర్చిలు, విగ్రహాలతో సమస్యలు



డొంకరోడ్డు మూడు వంతెనల ఆర్‌యూబీని ప్రారంభిస్తున్న పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డొంకరోడ్డు మూడు వంతెనల మార్గంలో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ప్రారంభించారు. శనివారం ఎమ్మెల్యేలు నసీర్‌అహ్మద్, గళ్లా మాధవి, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, రైల్వే ఏడీఆర్ఎం సైమన్లతో కలిసి డాక్టర్ పెమ్మసాని రిబ్బన్ కత్తిరించి ఆర్‌యూబీని పరిశీలించారు. ప్రవేశద్వారం వద్ద ఇరుకుగా ఉండటాన్ని గమనించి రైల్వే, నగర పాలకసంస్థ అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ ప్రకారం డొంకరోడ్డు 60 అడుగులు ఉందని, బ్రిడ్జి రెండు వెంట్స్ కలిపి 50 అడుగులు ఉన్నాయన్నారు. త్వరలోనే విస్తరణ పనులు చేపడతామన్నారు.

ఏప్రిల్‌లో శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులు

మూడొంతెనల ఆర్‌యూబీ శంకర్‌విలాస్ ఆర్వోబీకి ప్రత్యామ్నాయంగా ఉంటుందని డాక్టర్ పెమ్మసాని తెలిపారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులను రూ.5.50 కోట్ల అంచనాతో ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో కేవలం రెండు ప్లాట్‌ఫాంలపైనే 23 బోగీలు పట్టేవని, కొత్తగా మూడొంతెనల ఆర్‌యూబీ నిర్మాణంతో స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలలోకి ఫుల్‌లెంగ్త్ రైళ్లను తీసుకునే సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. మరో నాలుగు రైల్వేలైన్లు ఈ ఆర్‌యూబీ పైగా ఏర్పాటు కావడం వల్ల త్వరలోనే రైళ్లకు అవుటర్ సమస్యలు తీరిపోతాయని చెప్పారు. బ్రిడ్జి ప్రవేశద్వారం వద్ద రోడ్డు కొంత ఇరుకుగా మారిందన్నారు. రోడ్లపై ఉండే దేవాలయాలు, మసీదులు, చర్చిలు, విగ్రహాలతో సమస్యలు వస్తున్నాయన్నారు. మరో వందేళ్ల ట్రాఫిక్ సమస్యతోనే ఇబ్బంది పడదామా లేక రోడ్లకు అడ్డుగా ఉన్న వాటిని తొలగించి విశాలంగా మార్చుకుందామా అన్న విషయంపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఆర్‌యూబీకి సమీపంలో ఉన్న చర్చిని తొలగించొద్దని కొంతమంది స్థానికులు పెమ్మసానిని కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు ముత్తినేని రాజేష్, చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యానీ, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి, సీపీ రాంబాబు, కార్పొరేటర్లు శ్రీవల్లి, సమత పాల్గొన్నారు.

డీవీసీలో పూర్తి స్థాయి గుండె శస్త్ర చికిత్సలు



మాట్లాడుతున్న డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీవీసీ హాస్పిటల్‌లో పూర్తి గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ధూళిపాళ్ల జ్యోతిర్మయి తెలిపారు. శనివారం వడ్లమూడి డీవీసీ హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వైద్య బృందం, జ్యోతిర్మయి మాట్లాడుతూ డీవీసీ హాస్పిటల్ ప్రారంభించిన అనతి కాలంలోనే విస్తృత సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. 2020లో ఈసీజీ, ఎకో, డీఎంటీ వంటి వైద్య పరీక్షలతో ప్రారంభమైన కార్డియాలజీ విభాగం 2021లో చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా అత్యాధునిక క్యాథలాబ్ సమకూర్చుకున్నట్లు చెప్పారు. అతి తక్కువ సమయంలోనే 4 వేల ప్రొసీజర్‌లకు చేరువైనట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి వైద్య పరికరాలను డీవీసీ హాస్పిటల్‌లో చైర్మన్ నరేంద్రకుమార్ సహకారంతో సమకూర్చామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో డీవీసీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం హాస్పిటల్‌లో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత 3 శస్త్ర చికిత్సలు ఆయూష్ హాస్పిటల్ సహకారంతో పూర్తి చేసినట్లు చెప్పారు. గుండె రక్త నాళాలల్లో పూడిక తొలగించడం, స్టంట్ అమరిక, బైపాస్ సర్జరీలు వంటి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చిన్నారులకు పుట్టుకతో వచ్చే గుండె సమస్యలకు కోత లేకుండా డివైజ్ పద్ధతిలో చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు. వాల్వ్ రిప్లేస్‌మెంట్, గుండె రంధ్రాల పూడిక వంటి చికిత్సలు విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్ కరణం నవీన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ రామ్‌కిషోర్, డాక్టర్ సుందరరావు పాల్గొన్నారు.

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

గుంటూరు (లీగల్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికిగానూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 27న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత ప్రధాన కార్యదర్శి గురజాల అనూరాధ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నామినేషన్లు స్వీకరించి, పరిశీలన, ఉపసంహరణల అనంతరం ఈ నెల 18న సాయంత్రం వివిధ పోస్టులకుగానూ పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్ల లెక్కింపు జరుపుతామని, రాత్రికే ఫలితాలు వెల్లడిస్తామని ఆమె చెప్పారు. 2004 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఈసారి అధ్యక్ష పదవికి చతుర్ముఖ పోరు జరుగుతుంది. యంగలశెట్టి శివసూర్యనారాయణ (బబ్లూ), మధిర నాగేశ్వరరావు, ఖాజా భరద్వాజ, నంబూరు పాములు పోటీలో ఉన్నారు.

పాపులను రక్షించే దైవకుమారుడు ఏసయ్య

- హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- నేటితో గుడారాల పండగ ముగింపు



ప్రసంగిస్తున్న చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ



పండగలో పాల్గొన్న విశ్వాసులు

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాపులను రక్షించేందుకు పరలోకం నుంచి దిగివచ్చిన దైవకుమారుడు ఏసయ్య అని హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో జరుగుతున్న 48వ గుడారాల పండగలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన దైవజనులు, విశ్వాసులను ఉద్దేశించి ప్రసంగించారు. విశ్వాసులు చేసే ప్రార్థనకు సమాధానం చెపుతారని, స్వస్థత కల్పిస్తారని తెలిపారు. ఏసయ్యను నమ్మిన వారికి సమస్యల నుంచి విముక్తి కలిగించి సంతోషం కల్గిస్తారన్నారు. పాస్టర్లు అనిల్, రాజశేఖర్, రమేష్, రాజు దేవుని వాక్యం అందించి ఏసయ్యను ప్రార్థించారు. సూర్యుని వెలుగు ప్రకాశించినట్లు ఏసయ్య కరుణ దయాక్షేత్రంలో ఉన్న ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. దైవజనులు ఆలపించిన భక్తిగీతాలు విశ్వాసులను తన్మయత్వంలో ముంచాయి. జయ సంకేతమా.. దయాక్షేత్రమా అనే పాటను ఆలపించి హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ రమేష్ అందర్నీ భక్తి సాగరంలో ముంచారు. గురువారం ప్రారంభమైన గుడారాల పండగ ఆదివారంతో ముగుస్తుంది. మధ్యాహ్నం 1 గంట వరకు దైవజనుల ప్రసంగాలతో పండగ ముగుస్తుంది.

ప్రైవేటు యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమం సందర్భంగా ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. అయితే అకారణంగా మంత్రి బంధువు కుమారుడిపై పలువురు దౌర్జన్యం చేసి, కిడ్నాప్ చేయడంతో అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం.. వాసంశెట్టి సంతోష్ అనే విద్యార్థి స్థానిక ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ యూనివర్సిటీలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమానికి శుక్రవారం రాత్రి విచ్చేశాడు. ఇదే కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు కూడా విచ్చేశారు. యూనివర్సిటీలో స్టాల్స్ వద్ద ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ జరగడంతో ఓ విద్యార్థి కార్యక్రమానికి వచ్చిన పూర్వ విద్యార్థులకు తనపైన ఓ విద్యార్థి ఘర్షణకు దిగాడని, ఆ విద్యార్థి గురించి చెప్పడంతో విజయవాడకు చెందిన హరి, వినోద్ మరికొందరు సదరు విద్యార్థి కోసం గాలించారు. ఈ క్రమంలో ఆ విద్యార్థి మంత్రి బంధువు కుమారుడి కారులో దూరం వెళ్లి యూనివర్సిటీ గేటు వద్ద దిగిపోయాడు. అనంతరం సంతోష్ తన కారులో వెళుతుండగా ఘర్షణకు సంబంధం ఉన్న విద్యార్థి సదరు కారులో ఉన్నాడని ఊహించి పలువురు సంతోష్ కారును వెంబడించారు. కొలనుకొండ రైల్వే గేటు వద్ద గేటు పడి కారు ఆగగానే వారు కారులో ఉన్న సంతోష్‌ను దింపి తమ కారులో ఎక్కించుకుని మెల్లెంపూడి వైపు వెళ్లి అక్కడ ఘర్షణలో ఉన్న విద్యార్థి ఎక్కడంటూ సంతోష్‌ను ప్రశ్నించి దౌర్జన్యం చేశారు. ఆ మార్గాన వస్తున్న స్థానికులను చూసి హరికృష్ణ, సుమారు ఆరుగురు పరారయ్యారు. గాయపడిన సంతోష్‌ను విజయవాడలోని వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించి పోలీసులు పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. తాడేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గాయపడిన సంతోష్ ఓ మంత్రి బంధువని తెలిసిందని ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత



దైవ సందేశం అందిస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఆంతోని

మాచర్ల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తల్లి సాగరమాత అని నెల్లూరు సహవారస పీఠాధిపతి డాక్టర్ పల్లి ఆంతోని అన్నారు. మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగర మాత ఉత్సవాల్లో రెండో రోజైన శనివారం ఆలయంలోని జపమాల క్షేత్రంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన జరిగిన సమష్టి దివ్యపూజాబలిలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై దైవ సందేశం అందించారు. క్రైస్తవులు ఆదర్శంగా నిలవాలన్నారు. తోటి వారిని ఆదరించడం, ప్రేమను పంచడం క్రైస్తవ్యమన్నారు. ఉదయం 5 గంటలకు గురుశ్రీ చిన్నాబత్తిని కిరణ్‌కుమార్, 6 గంటలకు తుమ్మా కరుణాకరరెడ్డి, 7 గంటలకు పామిశెట్టి బాలస్వామి, 8 గంటలకు ఆర్ రాజు, 9.30 గంటలకు రవికుమార్, 11.30 గంటలకు అల్లం చిన శౌరెడ్డిలు దివ్య బలిపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిపారు. సాయంత్రం కోలాట ప్రదర్శన నిర్వహించారు. రాత్రి కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, సాగరమాత మహిమలు బుర్రకథ, శిలువదారి బైబిల్ నాటకం నిర్వహించారు.

డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 11లోగా పది మార్కుల జాబితా, ఆధార్, ఫొటో తదితర వివరాలతో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా శిక్షణ కేంద్రం(ఐటీఐ)లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం ఎస్‌కే మస్తాన్ ఏటీవో (9704668909)ను సంప్రదించాలని సూచించారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో విద్యార్థి మృతి



రాహుల్ గాంధీ (ఫైల్)

పెదకాకాని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ నానో టెక్నాలజీ (ఐదేళ్ల కోర్సు) చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ గాంధీ (20) బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతి చెందారు. విద్యార్థి రాహుల్ గాంధీ ఈ నెల 7న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. వెంటనే అతనిని వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందారు. ఏఎన్‌యూ ఉన్నతాధికారులు, నానో టెక్నాలజీ అధ్యాపకులు, సహచర విద్యార్థులు రాహుల్ గాంధీ మృతి పట్ల సంతాపం తెలిపారు.

వైభవంగా పల్నాటి తిరుమల తిరునాళ్ల

- వేంకటేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు
- కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ లైన్లో భక్తులు

రాజుపాలెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న మత్స్యావతార స్వయంభువుగా వెలసిన వేంకటేశ్వరస్వామి రెండో శనివారం తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని ఉదయం 7 గంటల నుంచే భక్తుల రాక ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగింది. రెండో శనివారం పల్నాటి తిరుమల మత్స్యావతార వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామివారి సన్నిధిలో ఎక్కువ మంది మహిళలు పొంగళ్లు పొంగిచ్చారు. పంటలు ఇళ్లకు వచ్చిన తరువాత వచ్చే పల్నాటి తిరుమల తిరునాళ్ల కావటంతో ధాన్యాన్ని స్వామివారికి సమర్పించారు. తిరునాళ్లకు పల్నాడు జిల్లా నుంచే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 17 వేల మంది దర్శించుకున్నట్లు ఈవో సురేష్ తెలియజేశారు. తిరునాళ్లకు సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

హుండీ ఆదాయం రూ.10 లక్షలు

పల్నాటి తిరుమలగా పేరుగాంచిన మండలంలోని దేవరంపాడు మత్స్యావతార వేంకటేశ్వరస్వామి రెండో శనివారం హుండీ ఆదాయం రూ. 10,97,573 వచ్చినట్లు ఈవో సురేష్ తెలియజేశారు.

లోక్ అదాలత్‌లో రాజధాని రైతుల కేసులు పరిష్కారం



కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్

మంగళగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో రాజధాని రైతులకు చెందిన ఏడు కేసులు పరిష్కారం కాగా అందులో డ్రోన్ కేసుకు సంబంధించి తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ కూడా రైతులు, జేఏసీ సభ్యులతో కోర్టుకు హాజరయ్యారు. ఇప్పటికే రాజధాని రైతులకు సంబంధించి పలు కేసులు గత లోక్ అదాలత్‌లో పరిష్కారమైన విషయం విదితమే.

లోక్ అదాలత్‌లో 292 కేసుల పరిష్కారం

మంగళగిరి కోర్టుల పరిధిలో శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో మొత్తం 292 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్, ఎన్ఐ యాక్టులు, సీసీలు, ఎక్సైజ్, ఎంసీ, డీవీసీ, 15 సివిల్ కేసులు ఉన్నాయి. వివిధ బ్యాంక్‌లకు సంబంధించి పలు కేసులు పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం అంజనీ ప్రియదర్శిని, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది భారతి, అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కమ్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన లోక్ అదాలత్ బెంచ్‌లో న్యాయమూర్తి కె.సురేష్‌బాబు, లోక్ అదాలత్ బెంచి న్యాయవాది రెంటపల్లి రాజేష్ పాల్గొన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా శనివారం రాత్రి 9 గంటల వరకు లోక్ అదాలత్ కేసుల పరిష్కారం కొనసాగింది.

మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదే

చిలకలూరిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి ఘనత చంద్రబాబుదేనని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్తిపాటి మాట్లాడుతూ కౌన్సిలర్లలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గర్వించాల్సిన విషయమనీ, సృష్టికి మూలమైన స్త్రీమూర్తులందరికీ హృదయ పూర్వక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డ్వాక్రా బజార్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. డ్వాక్రా మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీ, ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి, పతి శ్రీహరిబాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	88, 95, 105
చికెన్ విత్ స్కిన్	170.00
చికెన్ స్కిన్ లెస్	180.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

మహిళా లోకానికి మహాశక్తి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ● ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా మహిళా దినోత్సవం

గుంటూరు కార్పొరేషన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కష్టాలను ఎదుర్కొంటూ అకుంఠిత దీక్షతో ముందుకు వెళ్లగల మహాశక్తి మహిళా లోకం అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 కార్యక్రమంలో మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసు రత్నం, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్


కలెక్టర్ నాగలక్ష్మిని సత్కరిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, అధికారులు

గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ మహిళా హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఉద్యమ కారులకు, వివిధ రంగా ల్లో ఉన్నత శిఖరాలను చేరుకొని స్ఫూర్తిదాయకంగా ఉన్న నాయకురాళ్లకు, కుటుంబం మొత్తాన్ని ముందుకు తీసుకువెళుతున్న అమ్మలకు, శ్రమ జీవులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను మంత్రి పెమ్మసాని, కలెక్టర్, ఎస్పీ సతీష్ కుమార్ ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహూకరించారు. డీఆర్డీఏ ద్వారా 9591 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేసిన రుణం రూ.121,24,00,000 మెప్మా ద్వారా 540 పట్టణ స్వయం సహాయక సం ఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేసిన రుణం రూ.78 కోట్ల చెక్కులను అందించారు. సభలో తొలుత విద్యార్థులు, మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిం చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, ఐసీడీ ఎస్ పీడీ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, సీపీవో శేషశ్రీ, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేశు, బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు శ్రీని వాసులు, వెంకట కృష్ణయ్య, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కేర్ విద్యాసంస్థల సేవలు అమూల్యం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముందు చూపుతో డాక్టర్ సయ్యద్ రసూల్ సిస్టర్ కేర్ నర్సింగ్ కళాశాల, మదర్ కేర్ నర్సింగ్ స్కూల్‌తో పాటు కేర్ డెంటల్ కళాశాల, కేర్ డెంటల్ హాస్పిటల్‌ను ఏర్పా


ఇమేజింగ్ విభాగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

టు చేసి ఎందరికో విద్య, వైద్యం అందించడం అభినందనీయమని గుం టూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ కొనియాడారు. స్థాని క పొత్తూరులోని కేర్ డెంటల్ కాలేజీలో శనివారం నూతనంగా రేడియా లజీ విభాగంలో ఏర్పాటు చేసిన సీబీసీటీ 3డీ ఇమేజింగ్ విభాగా న్ని, ఐవోపీఏ విభాగాన్ని, ఏపీజే అబ్దుల్ కలాం లైబ్రరీని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో పాటు యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సయ్యద్ జవ హర్, కేర్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సయ్యద్ రసూల్, సంస్థ అడ్వైజర్ ఎంఆర్ మొహియుద్దీన్, డైరెక్టర్లు సయ్యద్ జీనత్, సయ్యద్ సమీనా, ప్రిన్సి పాల్ డాక్టర్ జాకీర్, డాక్టర్ మహబూబ్, డాక్టర్ స్మిత ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నూర్, డాక్టర్ శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'వైర్, కేబుల్స్ తయారీ'పై సదస్సు

పెదకాకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాలలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా ర్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్'లో భాగంగా ఎలక్ట్రికల్ కేబుల్స్, వైర్


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు సరస్వతీదేవి జ్ఞాపికను అందజేస్తున్న వీవీఐటీ అధ్యాపకులు

తయారీ, ఉపాధి అవకాశాలపై సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హెర్లిన్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పల్లె సోమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సులో సోమేశ్వరరెడ్డి మాట్లడుతూ వైర్ డ్రాయింగ్ పరిశ్రమల్లో విస్తృత అవకాశాలున్నాయని విద్యార్థులకు తెలిపారు. వైర్ డ్రాయింగ్ పరి శ్రమలోని తయారీ, నాణ్యత, భద్రత విభాగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె.గిరి బాబు, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధి పతి టీ శ్రీనివాసరావు ఈఈఈ విభాగాధిపతి ఏవీ సురేష్‌బాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో అందరూ భాగస్వాములు కావాలి

● తులసీ సీడ్స్ సంస్థ ఎండీ యోగీష్‌చంద్ర

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణలో ప్రజ లంతా భాగస్వాములు కావాలని తులసీ సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్‌చంద్ర కోరారు. తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, లఘు ఉద్యోగ్ భారతి వారి ఆధ్వర్యంలో నల్లపాడులోని జిల్లా పరిషత్ హైస్కూ ల్, నల్లపాడు ఆవరణలో శనివారం జాతీయ భద్రతా వారోత్స వంలో భా గంగా ప్రమాద నివారణ అవగాహనా సదస్సు జరిగింది. తులసీ సీడ్స్



సమావేశంలో మాట్లాడుతున్న తులసీ సీడ్స్ సంస్థ ఎండీ యోగీష్‌చంద్ర

సంస్థ ఎండీ తులసి యోగీష్‌చంద్ర మాట్లాడుతూ ప్రమాదాలు సంభవిం చకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను విద్యార్థు ల కు వివరించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిబంధనలు పాటించక పోవడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు జరుగుతున్నాయో గమనిస్తు న్నాయని, అందుకే ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. కార్యక్ర మంలో లఘు ఉద్యోగ భారతి గుంటూరు డివిజన్ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, హైస్కూల్ హెచ్ఎం జ్ఞాన ప్రసూన, విద్యార్థులు హాజరయ్యారు.

పోటీ ప్రపంచంలో విజయానికి నైపుణ్యాలే దిక్సూచి

● ఇన్ఫోసిస్ డీఎం సురేష్ నర్రా
● ఘనంగా ఆర్వీఆర్అండ్‌జేసీ వార్షికోత్సవం

గుంటూరు(విద్య), మార్చి 8(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో సమ ర్థవంతమైన సాంకేతిక నైపుణ్యాలే యువతకు దిక్సూచి అని ఇన్ఫోసిస్ డీఎం సురేష్ నర్రా అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్అండ్‌జేసీ ఇంజనీ రింగ్ కళాశాలలో శనివారం జరిగిన 40వ వార్షిక వేడుకలకు ఆయన


విద్యార్థినికి ప్రతిభ పురస్కారం అందజేస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్, చిత్రంలో ఇన్ఫోసిస్ ఎండీ సురేష్ నర్రా తదితరులు

ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు.

తెలుగు వారి ప్రతిభకు ఆస్కారు దాసోహం

తెలుగు వారి ప్రతిభ ముందు ఆస్కారు దాసోహమైందని, 140 కోట్ల భారతీయ ఆకాంక్షను సాధించిన ఘనత తెలుగు వాడిగా తనకు దక్కడం ఆనందంగా ఉందని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కె.చంద్రబోస్ అన్నారు. ప్రతిభ ఉంటే మనకు ఏదీ అడ్డురాదని ఆకాంక్షలు సాకారం చేసుకునేందుకు యువత కృతనిశ్చయంతో కృషి చేయాలన్నారు. చదువుతో పాటు యువత తమ కలల్ని సాకారం చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. తాను ఇంజనీరింగ్ విద్యార్థినేనని, అయితే చిన్నప్పటి నుంచే తెలుగుభాష, సాహిత్యంపై తనకు ఉన్న అభి లాష సినీ గేయ రచయితగా ఇంతటి వాడిని చేశాయన్నారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రా యపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆర్అండ్‌డీ కే రవీంద్ర తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేత నాలు, ప్రతిభ పురస్కారాలు అందజేశారు.

మహిళలకు ఉన్నత స్థానం కల్పించిన ఘనత టీడీపీదే : ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళలకు సమాజంలో ఉన్నత స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా కార్యాలయంలో రెండు రోజుల పాటు మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి జ్యోతి, శ్రీవల్లి, ఆడకా పద్మావతి, నేపాక పద్మ, పానకాల వెంకట మహాలక్ష్మి, పేరం అనిత, చెంబేటి మణికు మారి, గంటా మౌలిక, పద్మలతా, కురాకుల శోభారాణి, మల్లేశ్వరి, డాక్టర్ కల్పన, వికాస్ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్స వానికి ఎమ్మెల్యే మాధవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ స్టేడియం లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో, ఉమెన్స్ హాస్టల్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, జనసేన, బీజేపీ జిల్లా కార్యా లయం, ఏస్వీఎన్ కాలనీ పార్కు, ఫామ్ స్ప్రింగ్స్ అపార్టుమెంట్స్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు): అన్ని రంగాల్లో మహిళలు పది మెట్లు పైనే ఉన్నారు.. ఇంకా సమానత్వాన్ని గురించి మాట్లాడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే మాధవి అన్నారు. స్థానిక కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమ్మ జన సేవాసమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. న్యాయవాదులు ముత్తినేని శివలీల, రజిని, విజ్ఞాన్ నిరులా కాలేజీ ప్రిన్సిపాల్ పాతూరి రాణి, వ్యాపారవేత్త ముత్తవరపు మాధ వి, కార్డియాలజిస్ట్ పర్వతనేని నాగశ్రీ హరిత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో చుక్కపల్లి రమేష్, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, వడ్ల మూడి నాగేంద్రం, గుంటుపల్లి కోటేశ్వరరావు అతిథుల్ని సత్కరించారు.

సీఏలుగా రాణిస్తున్న మహిళలు : ఎమ్మెల్యే గౌతు శిరీష

గుంటూరు(విద్య), మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేడు మహిళలు అన్ని రం గాల్లోనూ రాణిస్తున్నారని, చార్టెడ్ అకౌంటెన్సీ రంగంలో వారు విశిష్టమైన నైపుణ్యాలు చూపుతున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మ హిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీనివాసరావుపేటలోని ఐసీఏఐ భవన్‌లో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ లింగమల్లు సత్యప్రియ, ఐసీఏఐ బ్రాంచి చైర్మన్ చింతా వీఎన్ఎస్ రఘునందన్, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకటనరేష్, వైస్ చైర్మన్ రుద్రవరపు భరద్వాజ, ట్రెజరర్ కన్నెగంటి మృత్యుంజయరావు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గుంటూరు(తూర్పు), మార్చి8 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, శంకరన్ సమా వేశ మందిరంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జయమ్మ దంపతులు ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో డీఈవో రేణుక తదితరులు పాల్గొన్నారు.

● ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎప్టీ ఎన్జీవో హోమ్‌లో జిల్లా మహిళా విభాగ చైర్మన్ ఏం రాధారాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్, షరీఫ్ మహిళా విభాగ రాష్ట్ర వైస్ చైర్ పర్సన్ వై పద్మజ, కె లక్ష్మీ రమ్య, కే. శివజ్యోతి, వి శ్రీవాణి, ఎం విజయలక్ష్మి, ముఖ్యఅతిథిగా వారాహి డెంటల్‌కేర్ ఆస్పత్రి వైద్యులు డా చదలవాడ యోగశ్రీ హాజరయ్యారు.

● స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహిళా సమాఖ్య పతకాన్ని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షు రాలు అత్తిలి విమల ఆవిష్కరించారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, జె.నరసింహారావు, డాక్టర్ బి.పుష్ప ప్రియాంక, గొనుపు శ్యామల, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

●రైలుపేట కన్నా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రైలుపేటలో విద్యా ర్థుల తల్లులకు క్విజ్, మహిళల అభివృద్ధిపై సినిమా పాటలు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్క రికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కన్నా మాస్టారు పాల్గొన్నారు.

● ఎస్‌సీఆర్‌డబ్ల్యూడబ్ల్యూవో గుంటూరు అధ్యక్షురాలు ఆశ లత

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసర మని దక్షిణ మధ్య రైల్వే మహిళ ఉద్యోగుల సంక్షేమ సంఘం గుంటూరు డివిజన్ అధ్యక్షు రాలు ఎం ఆశ లత అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా గుంటూరు రైల్వే డివిజనల్ ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ డీఎంవో డాక్టర్ ఏ ప్రియాంక, సెక్రెటరీ పీ షర్మిల, ఏడీఎంవో డాక్టర్ వీ సింధూ, సభ్యురాలు సౌమ్య పాల్గొన్నారు.

మహిళలకు విశిష్ట సత్కారాలు

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన మహిళామూర్తులకు విశిష్ట సత్కారాల కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. గుళ్ళపల్లి సుబ్బారావు సేవాసంస్థ తరపున గుంటు పల్లి అరుణకుమారి, సత్కార గ్రహీతలు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎస్సీ వర్గీకరణలో జిల్లా యూనిట్ విధానంపై పునరాలోచించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో జిల్లా యూనిట్ విధానంపై పునరాలో చించాలని మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ భవన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘనాయకులు కొమరాల శ్రీనివాస్, ఏటు కూరి విజయ్‌కుమార్, నాగరాజు, శ్రీనివాసరావు, భూషణం, కిన్నెర, నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్అదాలత్‌లో 3027 కేసులు పరిష్కారం

గుంటూరు(లీగల్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3027 కేసులు రాజీమార్గంలో పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 388, క్రిమినల్ కేసు లు 2531, ప్రీ-లిటిగేషన్ కేసులు 108 ఉన్నాయి ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ. 11,49,01,747 మేరకు వాటిలోని కక్షిదారులకు లబ్ధి చేకూరింది.

స్వచ్ఛ నగరంలో మహిళ కార్మికుల పాత్ర విలువైనది

గుంటూరు కార్పొరేషన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజారోగ్య కార్మికుల్లో మహిళా కార్మికుల పాత్ర విలువైనదని, విధులపై వారి అంకిత భావం ఆదర్శనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కమిషనర్ పాత గుం టూరులోని 2, 6 శానిటేషన్ మస్టర్ పాయింట్లను, అభివృద్ధి పనులను తనిఖీ చేసి, మహిళా కార్మికులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. పర్యటనలో డీఈఈ కళ్యాణరావు, ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ కమిషనర్

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎన్నికల కోడ్ వల్ల నిలిచిన పీజీఆర్ఎస్‌ని తిరిగి ప్రారం భిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం స్థానిక సమస్యల పరిష్కారానికి ఉద యం 9:30 నుంచి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థకమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు, మల్లయ్య లింగం భవన్‌లో ఈనెల 16, 17 తేదీల్లో జరిగే రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సంఘ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు.

కేంద్ర మంత్రి పెమ్మసానికి బైకు ర్యాలీతో స్వాగతం

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం నిర్మాణం ప్రారంభమై అర్ధాంతరం గా నిలిచిపోయిన నందివెలుగు రోడ్డు రైల్వే వోవర్


బైకు ర్యాలీ (ఇన్‌సెట్లో) పెమ్మసాని, నసీర్

బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించిన కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం లభించింది. శనివారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ నేతృత్వంలో వందల సంఖ్యలో ప్రజలు బైకులతో వెళ్లి ఎన్టీఆర్ మానస సరోవరం వద్ద పెమ్మసానికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా నందివెలుగు ఆర్వోబీ వద్దకు చేరుకొని మంత్రి పెమ్మసాని పెండింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు రూ.10 కోట్లు చెల్లించకపోవడం వల్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం ఈ పనులు పూర్తి చేయ డానికి రూ.36 కోట్ల నిధులు అవసరమౌతాయని, అందులో రూ.10 కోట్లు పెండింగ్ బిల్లులకు, మిగతా రూ.26 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి అని చెప్పారు.

నగర మేయర్ పీఠంపై సమష్టి నిర్ణయం : పెమ్మసాని

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ మేయర్ పీఠంపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శనివారం సాయంత్రం డొంకరోడ్డు మూడొంతెనల ఆర్‌యూబీ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే విషయంపై తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, కార్పొరేటర్లందరితో చర్చించాల్సి ఉందన్నారు. అలానే మేయర్‌గా ఎవరిని పోటీకి దింపాలనే దానిపై తాను ఒక్కడినే నిర్ణయిస్తే సరిపోదని, అందరూ కలిసి కూర్చుని మాట్లాడుకొన్న తర్వాతే నిర్ణయానికి వస్తామన్నారు.

మహిళ సాధికారత ర్యాలీ

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్స వం పురస్కరించుకొని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు 'మహిళ సాధికారత ర్యాలీ' నిర్వహించారు. పోలీస్ పరేడ్ మైదానం నుంచి మూడు బొమ్మల సెంటర్ మీదుగా తిరిగి పరేడ్ మైదానం వరకు జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు జెండా ఊపి ప్రారంభించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెన్నై కలకత్తా జాతీయ రహదారిపై బుడంపాడు సమీపంలోని శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాయపాలెం గ్రామానికి చెందిన వై.నిఖిల్ (24) మృతి చెందాడు. లింగాయపాలెం గ్రామానికి చెందిన నిఖిల్ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణబాబు కాలనీ రెండోలై నుకి చెందిన షేక్ ఇబ్రహీం (43) అనే వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక పురుగుల మందు తాగి ఆపై ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసుల కథనం మేరకు.. కృష్ణబాబు కాలనీకి చెందిన ఇబ్రహీం, షేక్ ఖైరున్నీసా బేగం దంపతులు స్థానికంగా కిరాణా షాపు నిర్వహిస్తుం టారు. ఈ నెల 7న స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఇబ్రహీం ఫోన్ నుంచే గుర్తు తెలియని వ్యక్తులు భార్యకు ఫోన్ చేసి జగనన్న కాలనీ వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు.

అప్పు డబ్బులు ఇవ్వలేదని మహిళ నిర్బంధం

తన దగ్గర తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదనే కారణంతో ఓ మహిళను నిర్బంధించిన ఘటనపై అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వీరస్వామి కథనం మేరకు.. బాలశేఖర్‌బాబు, వాసవి దం పతులు గతంలో శారదా కాలనీలో నివాసం ఉన్నారు. అప్పులు కావడంతో వారు విజయవాడ వెళ్లిపోయారు. వాసవి తమ్ముడు మృతి చెందడంతో శనివారం భార్యాభర్తలు శారదాకాలనీ వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ముత్యాలరెడ్డి నగర్‌కు చెందిన నర్సారెడ్డి వారి వద్దకు వెళ్లి తనకి ఇవ్వాల్సిన బాకీ రూ.4 లక్షలు ఇవ్వాలంటూ వాసవిని తన ఇంటికి తీసుకువెళ్లి గదిలో నిర్బంధించాడు.

మహిళల్లో వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు

● ఇస్రో హెచ్‌క్యూ డిప్యూటీ డైరెక్టర్ నిరుపమ తివారి

గుంటూరు(విద్య), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల్లోనే వైవిధ్యమైన నైపు ణ్యాలు, నాయకత్వ లక్షణాలు ఉంటాయని ఇస్రో హెచ్‌క్యూ డిప్యూటీ డైరెక్టర్ నిరుపమ తివారి అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శని



నిరుపమ తివారిని సత్కరిస్తున్న విజ్ఞాన్‌వర్సిటీ అధ్యాపకులు

వారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ప్రతి రంగంలోనూ మహిళలు నిర్వహిస్తున్న సంస్థలు విప్లవాత్మక మార్పులతో ముందుకు సాగుతున్నాయని అన్నారు. విద్య, ఆరోగ్య, విజ్ఞానం వంటి రంగాల్లో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో రిపబ్లికన్ ఆఫ్ జింబాబ్వే ప్రెసిడెన్షియల్ అండ్ నేషనల్ స్కాలర్‌షిప్ డిపార్టుమెంట్ ఆఫీస్ ప్రెసిడెంట్ అండ్ కేబినెట్ చీఫ్ డాక్టర్ వడానాని కచేరే, నవభారత్ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ యార్లగడ్డ త్రిపురాంబ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ షమా సుల్తానకు ఉత్తమ మహిళా అవార్డు

● ప్రదానం చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

గుంటూరు మెడికల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముంబయ్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్‌లో ఈ నెల ఏడో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపవర్ అనే అంశంపై నిర్వహిం చిన సమావేశంలో గుంటూరుకు చెందిన హోప్ విన్ హాస్పిటల్స్ చైర్‌పర్సన్, గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తాన తన జీవన కథను తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ సెంట్రల్ వారు డాక్టర్ షమా సుల్తానకు ఉత్తమ మహిళా అవార్డును అందజేసి సత్కరించారు. గుంటూరులో


ఉత్తమ మహిళా అవార్డును అందుకుంటున్న డాక్టర్ షమా సుల్తాన

హోప్‌విన్ హాస్పిటల్స్ తరఫున డాక్టర్ షమా సుల్తాన చేస్తున్న సేవా కార్యక్రమాలను బ్యాంక్ అధికారులు ప్రశంసించారు. సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెంట్రల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రేష్ఠ హాస్పిటల్స్ నిబద్ధత

గుంటూరు మెడికల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సంద ర్భంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ హెల్త్ ప్యాకేజీలు, హెచ్‌పీవీ టీకాను ప్రారంభించడం ద్వారా ఆరోగ్య సంరక్షణపై తన నిబద్ధతను మరోసారి నిరూపించుకుంది. సీని యర్ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ కాంతం, డాక్టర్ కీర్తి, డాక్టర్ మూర్తి కనకాల నేతృ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లక్ష్మీకాంతం, కీర్తి, మూర్తి

త్వంలో ఈ ప్యాకేజీలను ఆవిష్కరించారు. గర్భాశయ కేన్సర్ గురించి యువతులు అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ వైద్యులు సూచిం చారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ ప్రమాదం బారిన పడకుండా కాపాడుకోవచ్చని వివరించారు. ఇప్పటి వరకు పెద్దలు, వృద్ధుల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించిన శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రస్తుతం యువతరానికి తన సేవలను విస్తరిస్తోంది. వ్యాధి నివారణ అంశాలను ప్రోత్సహిస్తోంది.

సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో..

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీ స్ ఆర్గనైజే షన్, గెట్ టుగెదర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగం డీన్ అడుసుమిల్లి మణి అధ్యక్ష తన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో అగర్వాల్ హాస్పిటల్ కంటి వైద్యురాలు డా.లావు మేఘన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రమేష్ హాస్పిటల్ పాథాలజిస్టు డా.చాగంటి పద్మావతి, ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా కార్యదర్శి శ్రీమతి గరికపాటి జయశ్రీ ప్రసంగించారు. అనంతరం కమ్మ జన సేవ సమితి వసతి గృహంలో వసతి పొందుతున్న ఉత్తమ పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

● బీజేపీ కార్యాలయంలో..

జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం బీజేపీ జిల్లా కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనం గా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా యామిని శర్మ, డాక్టర్ శనక్కాయల రాజకుమారి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, నాయకులు పాల్గొన్నారు.

● ఎస్‌వీఎన్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో....

శ్రీతారకరామ ఎస్‌వీఎన్ కాలనీ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, విజయవాడ డీసీపీ కేజీవీ సరిత, వికాస తరంగిణీ పాల్గొని గతంలో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.


వైభవంగా స్వామివారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని శ్రీ గౌరీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, ఆలంకరణలు నిర్వహించి, అనంతరం ద ంపతులతో అర్చకస్వామి గౌరి విశ్వేశ్వరశర్మ కల్యాణం నిర్వహించారు.

వైభవంగా శ్రీధాన్యలక్ష్మి కల్యాణం

స్థానిక అరండల్‌పేట, శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి వారి దేవాలయంలో నిర్వహిస్తున్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గణపతి పూజ, గోపూజ, శ్రీచక్రమేరుకు విశే షాభిషేకాలు, అర్చనలు జరిగాయి. కల్యాణాల్లో భాగంగా శ్రీధాన్యలక్ష్మి అమ్మవారి కల్యాణం కనులపండువగా జరిగింది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యూ సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవి విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజార్ నిర్మించారు.



వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్థకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్ స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహా లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.



'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం





చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేమిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే 'కైలాస ఎడ్వర్‌టైజింగ్' అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మి రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

> **మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?**
>
> సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?


గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

● సివిఎల్ఎన్ ప్రసాద్



> కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.



వారసులు వచ్చేస్తున్నారు...



ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాస రావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్, 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా...డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

> ### యంగ్ పవన్‌గా..
>
> పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.
>
> నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



నగర మేయర్ పీఠంపై సమష్టి నిర్ణయం

● కేంద్ర మంత్రి పెమ్మసాని ఆసక్తికరమైన వ్యాఖ్యలు

గుంటూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ మేయర్ పీఠంపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శనివారం సాయంత్రం డొంకరోడ్డు మూడొంతెనల ఆర్‌యూబీ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే విషయంపై తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, కార్పొరేటర్లందరితో చర్చించాల్సి ఉందన్నారు. అలానే మేయర్‌గా ఎవరిని పోటీకి దింపాలనే దానిపై తాను ఒక్కడినే నిర్ణయిస్తే సరిపోదని, అందరూ కలిసి కూర్చుని మాట్లాడుకున్న తర్వాతే నిర్ణయానికి వస్తామన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాల ప్రదర్శన

గుంటూరు సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను జిల్లాలోని గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం నుంచి జాబితాలను ప్రదర్శించనున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. రైతులు పంటలు సాగు చేసిన తర్వాత సదరు వివరాలను గ్రామంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ-పంటలో నమోదు చేస్తారు. కొన్ని సందర్భాల్లో పొలంలోకి వెళ్లకుండానే ఈ-పంట నమోదు ప్రక్రియ నిర్వహించినట్లు ఆరోపణలు వచ్చాయి. దానిపై కేంద్ర వ్యవసాయశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఈ-పంట నమోదు వివరాలు రైతుల ముందుకు తీసుకువచ్చేందుకు ఏర్పాటు చేశారు. రైతులు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తాము సాగు చేసిన పంట వివరాలు ఈ-పంటలో నమోదయ్యాయో లేదో తనిఖీ చేసుకోవచ్చు. సవరించిన తుది జాబితాను ఈ నెల 22న ప్రదర్శించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

రూ.80 వేల ఎల్‌వోసీ చెక్కు అందజేత

మంగళగిరి సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ జానియా బేగం అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థికసాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, మంత్రి నారా లోకేశ్ చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.80 వేలు మంజూరయ్యాయి. రూ.80 వేల విలువైన లైఫ్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) చెక్కును స్థానిక నేతలు శనివారం బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

రాజాధిరాజ వాహనంపై దేవదేవుడు



మంగళగిరి సిటీ, మార్చి 8: మంగళాద్రి వాసుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారు శనివారం రాత్రి రాజాధిరాజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ధర్నాకు తరలిరావాలి

● కొల్లా రాజమోహనరావు

పెదనందిపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయశాఖ కమీషనర్ కార్యాలయం వద్ద ఈనెల 10న జరిగే ధర్నా కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నల్లమడ రైతు సంఘ నేత కొల్లా రాజమోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ అంకమ్మచౌదరి, బోడావుల హనుమంతరావు, నాగేశ్వరరావు, కొల్లా రామన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్లకు వినతి

వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రభుత్వం జోక్యం చేసుకొని అన్ని విధాలా ఆదుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. మండలపరిధిలోని నాగులపాడులో ఓ ప్రయివేటు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నరేంద్రకుమార్‌కు ఈ ప్రాంత సమస్యలను వివరించారు.

పురుగు మందు తాగి రైతు మృతి

ఫిరంగిపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తక్కెళ్ళపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తక్కెళ్ళపాడుకి చెందిన చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(60) వ్యవసాయం చేస్తుంటాడు. వెంకటేశ్వరరెడ్డి భార్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మానసికంగా ఆవేదన చెందుతూ శుక్రవారం పురుగుమందు తాగాడు. చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ఆయన మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవీంద్రబాబు శనివారం తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

తుళ్లూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు దొండపాడు మధ్యలో ఉన్న కాలువలో మృతదేహం తేలియాడుతూ శనివారం ఉదయం స్థానికులకు దర్శనమిచ్చింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి పరిశీలించగా అమరావతి మండలం ధరణికోట గ్రామవాసి ధనేకుల వెంకటేశ్వరావు(58)గా గుర్తించారు. గత నెల 23న విజయవాడలో ఉన్న సోదరుడి దగ్గరకు వెళుతున్నట్టుగా ఇంట్లో చెప్పి వచ్చాడు. ఇంతకు ముందు లారీలు తిప్పేవాడని, నష్టం రావటంతో ప్రస్తుతం వెంకటేశ్వరావు ఖాళీగానే ఉంటున్నాడని బంధువులు చెప్పినట్టు ఎస్ఐ కలగయ్య తెలిపాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి హాస్పిటల్‌కు తరలించారు.

కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు అందలం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ

● ఘనంగా మహిళా దినోత్సవం



మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళలు

మంగళగిరి సిటీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, అన్ని రంగాల్లోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తుందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి మహిళలకు ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తెలుగు మహిళలు వింజమూరి ఆషాబాల, మంచికలపూడి వైష్ణవి, ఊట్ల దుర్గామల్లేశ్వరీ, గడ్డిపాటి అపర్ణ, వాసా పద్మ, అప్పల శాంతి, పద్మజ, కాటాబత్తుల నిర్మల, మద్దిసాని ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి సీపీఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య జెండాను సుజాత ఆవిష్కరించారు. అనంతరం చిన్ని శివకుమారి అధ్యక్షతన జరిగిన సభలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోనూ మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య విజయవాడ నగర కార్యదర్శి దుర్గాంబ, జొన్నాదుల భారతి, కుమారి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో సత్తాచాటుతున్నారు

● నన్నపనేని రాజకుమారి



నన్నపనేని రాజకుమారి దంపతులను సత్కరిస్తున్న కరస్పాండెంట్ విజయలక్ష్మి, శ్రీఅనిత, ఝాన్సీరాణి తదితరులు

దుగ్గిరాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ ప్రతిభ చాటుతున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మహిళాదినోత్సవంలో ముఖ్యఅతిథిగా రాజకుమారి పాల్గొన్నారు. రాజకుమారి దంపతులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కరస్పాండెంట్ చందు విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మీనారాయణ, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు.

● తాడికొండ(లాం) (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మహిళలు ప్రతి రంగంలో విశేషమైన పాత్ర పోషిస్తున్నారని విజయవాడకు చెందిన ఐఎంఐఎస్ ఫార్మాసూటికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వీ నాగలక్ష్మి అన్నారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ముఖ్య అతిథులుగా కాటూరి మెడికల్ కళాశాల గైనకాలజిస్టు డాక్టర్ వీణ మాధురి, చలపతి విద్యాసంస్థల కోశాధికారి వై.అనంతకుమారి పాల్గొన్నారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో చలపతి విద్యా సంస్థల కోశాధికారి వై.అనంతకుమారి, ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్, పీ.జయంతి పాల్గొన్నారు.

● ఫిరంగిపురం,(ఆంధ్రజ్యోతి): మహిళకు సమాజంలో గౌరవం పెరగాలని జడ్పీటీసీ దాసరి కత్తి రేణమ్మ అన్నారు. కత్తిరేణమ్మను పంచాయతీ మహిళా మెంబర్లను ఈవో ఏకే బాబు పుష్పగుచ్ఛాలు ఇచ్చి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయాలి

● అర్జున అవార్డు గ్రహీత ఇషాసింగ్



వీఐటీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న అర్జున అవార్డు గ్రహీత ఇషాసింగ్

తుళ్లూరు(ఐనవోలు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విజయం సాధించాలంటే కష్టపడి పని చేయాలి.. తక్కువ మార్కులు వచ్చాయని బాధపడకూడదు.. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరాలని శనివారం రాజధాని గ్రామం ఐనవోలు పరిధిలోని వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అర్జున అవార్డు(షూటింగ్) గ్రహీత ఇషాసింగ్ అన్నారు. విటోపియా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులు, స్టాఫ్‌కు ఆమె మెడల్స్ బహూకరించారు. మహిళలు అని తక్కువ అంచనా వేసుకోవద్దని, మన బలం మనం తెలుసుకుంటే ఎంతో ఎత్తుకు ఎదగవచ్చని ఇషాసింగ్ అన్నారు. అయితే ఏదైనా సరే గట్టి సంకల్పంతో ముందుకెళ్లాలని కోరారు. వైస్ చాన్సలర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. 2017వ సంవత్సరంలో వీఐటీ క్యాంపస్‌లో కేవలం 8 శాతం మహిళా విద్యార్థులతో ప్రారంభమైందని, అది ఇప్పుడు 33శాతానికి పెరిగిందని, త్వరలో 50శాతానికి చేరుతుందని మేము ఆశిస్తున్నామని అన్నారు. విటోపియా 2025 వార్షిక క్రీడల, సాంస్కృతిక ఉత్సవం రెండో రోజు సాయంత్రం సంగీత విభావరి అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో వీఐటీ - ఏపీ రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి, విటోపియా కన్వీనర్ కృష్ణస్వామి, స్టూడెంట్ వెల్‌ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఖాదర్ పాషా, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, మండలంలో ఉన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. స్థానిక అరండల్‌పేట, టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన ప్రత్తిపాడు నియోజకవర్గ కుటుంబ సాధికార సారథుల అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి ఒక్కో నియోజకవర్గానికి రూ.20 నుంచి రూ.22 కోట్లు తీసుకురాగాలిగామని, ప్రత్తిపాడుకు మాత్రం రూ.23 కోట్లు తీసుకురాగలిగామని అన్నారు. ఛానల్ విస్తరణ పనులకు భూసేకరణకు కలిపి రూ.400 కోట్లు మంజూరు చేయించుకోగలిగామని అన్నారు. అనంతరం ప్రత్తిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు మండలాల్లోని పలువురు గ్రామస్థులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

పెదగొట్టిపాడు, చిన్నకొండ్రుపాడు, కోయవారిపాలెం, కాట్రపాడు తదితర గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్లు పెన్షన్లు డొంక రోడ్ తదితర సమస్యలు ఉన్నాయని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, వడ్రాణం హరిబాబు, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతమే లక్ష్యం

● కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. కలెక్టరేట్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం ప్రత్తిపాడు పరిధిలోని మానవ వనరుల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులతో నూతన విద్యావిధానంపై సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు డీఈవో రేణుక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ నూతన విద్యావిధానంపై నెలకొన్న అపోహలను తొలగించాలన్నారు. ఈ విధానంపై త్వరలోనే వర్క్‌షాప్‌ను నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో 6,7,8 విద్యార్థులు ఉన్న చోట విద్యార్థుల సంఖ్యను బట్టి ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తి చేయడానికి జిల్లా పరిపాలన యంత్రాంగం ప్రమేయం చాలా అవసరమన్నారు. నియోజకవర్గంలో 41 పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. పాఠశాల కుదింపుపై విష ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి 2వేల మంది ప్రవాసాంధ్రులు ముందుకు వచ్చారని వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలీ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఘనంగా ముగిసిన సురభి వేడుకలు



లైఫ్ చిత్రబృందంలో ఎస్‌పీ చరణ్

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న సురభి 2025 వేడుకలు శనివారం నాడు ఘనంగా ముగిశాయి. తొలుత జరిగిన కార్యక్రమంలో భాగంగా మ్యాడ్ స్క్వేర్ చిత్రబృందం, లైఫ్ చిత్రాల బృందాలు సందడి చేశాయి. మ్యాడ్ స్క్వేర్ సినిమా హీరో నరేన్ నితిన్, హీరోయిన్ ప్రియాంకా జ్వాలాకర్, సినిమా నిర్మాత హారిక, లైఫ్ సినిమా హీరో శ్రీహర్ష, తండ్రి పాత్ర చేసిన ఎస్‌పీ చరణ్, సినిమా డైరెక్టర్ పవన్‌లు విద్యార్థులతో ముచ్చటించి అలరించారు. ప్రముఖ సినీ గాయకుడు లైఫ్ సినిమాలో తండ్రి పాత్ర చేసిన ఎస్‌పీ చరణ్ మాట్లాడుతూ కుటుంబ కథతో చిత్రం తెరకెక్కిన లైఫ్ సినిమా కుటుంబంతో కలిసి చూడవచ్చని అన్నారు. కాగా మిసెస్ ఆసియా రితికా వినయ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మరో ముఖ్యఅతిథి ఇన్ఫోసిస్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్ నర్రా, తెలుగు చలన చిత్ర దర్శకులు కరుణకుమార్ ప్రసంగించారు. కేఎల్‌యూ వీసీ సారధివర్మ మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ స్థాయి సురభి వేడుకలకు దేశవ్యాప్తంగా ఆయా యూనివర్సిటీలు, కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ప్రోచాన్స్‌లర్ జగన్నాధరావు, ప్రోవీసీలు ప్రసాద్, రాజశేఖర్, వెంకటరామ్, రిజిస్ట్రార్ సుబ్బారావు, సురభి ఛైర్‌పర్సన్ ఆర్‌ఎస్ ప్రసాద్, కన్వీనర్లు సాయి విజయ్, సుమన్, డీన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పేరేచర్లలో మద్యం షాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు

మేడికొండూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పేరేచర్లలో ఇప్పటికే రెండు మద్యం షాపులు నడుస్తుండగా తాజాగా మూడో షాపును శనివారం తెరుస్తుండగా స్థానిక మహిళలు అడ్డుకొని ఆందోళన చేశారు. కల్లు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన షాపులలో మేడికొండూరు మండలానికి ఒక షాపు దక్కింది. షాపును దక్కించుకున్న వారు పేరేచర్లలో పెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. శనివారం స్టాకును దించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు.

అమరావతి ఉద్యమ మహిళలకు సన్మానం



అమరావతి ఉద్యమ మహిళలను సన్మానిస్తున్న స్ఫూర్తి సేవాసంస్థ సభ్యులు, పలువురు టీడీపీ నేతలు

తుళ్లూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అమరావతి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మహిళలను స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌రెడ్డి అమరావతి నాశనం కోసం ఎక్కడా లేని మూడు రాజధానుల అంశం తెరమీదకు తెచ్చారు. దీంతో రైతులు, రైతు కూలీలు, మహిళలు ఉద్యమించారు. ఒకే రాష్ట్రం ఒకే రాజధాని.. అదే అమరావతి అంటూ సుదీర్ఘంగా 1631 రోజులు ఉద్యమించారు. మహిళలే ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. వారిపై అక్రమ కేసులు కూడా వైసీపీ సర్కార్ పెట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తుళ్లూరు బాపూజీ పాఠశాలలో వారిని స్ఫూర్తి సేవాసంస్థ సభ్యులు, టీడీపీ నేతలు శాలువాలతో అమరావతి ఉద్యమ కారిణులను ఘనంగా సత్కరించింది. జ్ఞాపికలు అందజేశారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు : ఎస్పీ

తుళ్లూరు, (ఐనవోలు) మార్చి 8(ఆంధ్రజ్యోతి) మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం రెండో రోజు పురస్కరించుకొని డ్రగ్స్ రహిత ఇండియా కోసం.. అనే మారథాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎస్పీ పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర ముదిగంటి, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.రామచంద్రరావు, విటోపియా కన్వీనర్ కృష్ణస్వామి, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలే యువతకు దిక్సూచి

● ఇన్ఫోసిస్ డీఎం సురేష్ నర్రా

● ఘనంగా ఆర్వీఆర్‌అండ్‌జేసీ 40 వార్షికోత్సవం



విద్యార్థినికి ప్రతిభ పురస్కారం అందజేస్తున్న సినీ గేయ రచయిత చంద్రబోస్, చిత్రంలో ఇన్ఫోసిస్ ఎండీ సురేష్ నర్రా తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 8(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో సమర్థవంతమైన సాంకేతిక నైపుణ్యాలే యువతకు దిక్సూచి అని ఇన్ఫోసిస్ డీఎం సురేష్ నర్రా అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన 40వ వార్షిక వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

తెలుగు వారి ప్రతిభకు ఆస్కారు దాసోహం

తెలుగు వారి ప్రతిభ ముందు ఆస్కారు దాసోహమైందని, 140 కోట్ల భారతీయ ఆకాంక్షను సాధించిన ఘనత తెలుగు వాడిగా తనకు దక్కడం ఆనందంగా ఉందని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కె.చంద్రబోస్ అన్నారు. ప్రతిభ ఉంటే మనకు ఏదీ అడ్డురాదని ఆకాంక్షలు సాకారం చేసుకునేందుకు యువత కృతనిశ్చయంతో కృషి చేయాలన్నారు. చదువుతో పాటు యువత తమ కలల్ని సాకారం చేసుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, ట్రెజరర్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాలలో ముగిసిన టెక్నో ఫెస్ట్

● సభలో అలరించిన మ్యాడ్ 2 చిత్ర బృందం..

మేడికొండూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మేడికొండూరు మండలం గుండ్లపాలెంలోని ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సరితం(టెక్నో, స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్) 2కె25 టెక్నో ఫెస్ట్ రెండో రోజు శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా జరిగిన సభలో మ్యాడ్ 2 చిత్ర బృందం అలరించింది. ఈచిత్రానికి డైరెక్టర్‌గా పనిచేస్తున్న కళ్యాణ్ శంకర్‌తో పాటు చిత్ర బృందంలోని సినీ హీరో నార్నె నితిన్, సంగీత్ శోభన్, ప్రియాంక జవాల్కర్ కూడా హాజరై విద్యార్థులను ఆలరించారు. తమ సినిమా యూత్ ఎంతో ఆదరిస్తారని డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ తెలియజేశారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులు చిత్ర బృందంతో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ఫ్యూజన్ బ్యాండ్ ద్వారా అక్సర్ ఖాన్ ద్వారా నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుర్రా శరత్ చంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు, ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, ఏవో బండారు సీతారామయ్య, హెచ్‌ఓడీలు డాక్టర్ చంద్రమౌళి, రాము, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రముఖ డాన్సర్ అక్సా ఖాన్ మాట్లాడుతూ విద్యార్థులు గోల్ నిర్ణయించుకోవాలని, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ అనేది ఎంతో అవసరమని చెప్పారు. ఫ్యూజన్ బ్యాండ్ ఆధ్వర్యంలో పాడిన పాటలు విద్యార్థినీ, విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

మంగళగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 11వ తేదీన జరుగనున్న సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కలెక్టర్ నాగలక్ష్మి శనివారం వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం ప్రసంగించే ఆడిటోరియం, శంకుస్థాపన చేయనున్న ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాగా, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్లు మాగంటి శిరీష, ఆయేషా, పంకజ్ పారిక్, రేవతి బాలకృష్ణన్‌లు కలెక్టర్ నాగలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎ.భార్గవతేజ, తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కలెక్టర్ నాగలక్ష్మి

● 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌ల పంపిణీ



పది విద్యార్థులకు పరీక్ష కిట్‌లను పంపిణీ చేస్తున్న ఉప్పుటూరి చినరాములు, ఎమ్మెల్యే బూర్ల, కలెక్టర్ నాగలక్ష్మి, విద్యాశాఖ అధికారి రేణుక

వట్టిచెరుకూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి తన తల్లి మాజీ జడ్పీటీసీ స్వర్గీయ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం తన తండ్రి ఉప్పుటూరి చిన రాములు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం ప్రశంసనీయమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కలెక్టర్ నాగలక్ష్మి కొనియాడారు. గుంటూరులోని శంకర్ సమావేశ మందిరంలో ఉప్పుటూరి చిన రాములు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు మండలాల పరిధిలోని హైస్కూళ్లలో 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 1200 మంది విద్యార్థుల కోసం సిద్ధం చేసిన పరీక్ష కిట్‌లను ఎమ్మెల్యే బూర్ల, కలెక్టర్ నాగలక్ష్మి, డీఈవో సీవీ రేణుక, డీఆర్వో ఖాజావలిల చేతుల మీదుగా చినరాములు స్వయంగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'వైర్, కేబుల్స్ తయారీ'పై సదస్సు



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులకు జ్ఞాపిక అందజేస్తున్న వీవీఐటీ అధ్యాపకులు

పెదకాకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన 'ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్'లో భాగంగా ఎలక్ట్రికల్ కేబుల్స్, వైర్ తయారీ, ఉపాధి అవకాశాలపై సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హెర్లిన్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పల్లె సోమేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సదస్సులో సోమేశ్వరరెడ్డి మాట్లడుతూ వైర్ డ్రాయింగ్ పరిశ్రమల్లో విస్తృత అవకాశాలున్నాయని విద్యార్థులకు తెలిపారు. వైర్ డ్రాయింగ్ పరిశ్రమలోని తయారీ, నాణ్యత, భద్రత విభాగాల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించు కోవాలని, పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు విద్యార్థులు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కే గిరిబాబు, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి టీ శ్రీనివాసరావు ఈఈఈ విభాగాధిపతి ఏవీ సురేష్‌బాబు అధ్యాపకులు పాల్గొన్నారు.

కేర్ విద్యాసంస్థల సేవలు అమూల్యం : ఎమ్మెల్యే నసీర్



ఇమేజింగ్ విభాగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మెడికల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ముందు చూపుతో డాక్టర్ సయ్యద్ రసూల్ సిస్టర్ కేర్ నర్సింగ్ కళాశాల, మదర్ కేర్ నర్సింగ్ స్కూల్‌తో పాటు కేర్ డెంటల్ కళాశాల, కేర్ డెంటల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి ఎందరికో విద్య, వైద్యం అందించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ కొనియాడారు. స్థానిక పొత్తూరులోని కేర్ డెంటల్ కాలేజీలో శనివారం నూతనంగా రేడియాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన సీఈసీటీ 3డీ ఇమేజింగ్ విభాగాన్ని, ఐవోపీఏ విభాగాన్ని, ఏపీజే అబ్దుల్ కలాం లైబ్రరీని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో పాటు యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సయ్యద్ జవహర్, కేర్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ సయ్యద్ రసూల్, సంస్థ అడ్వైజర్ ఎంఆర్ మొహియుద్దీన్, డైరెక్టర్లు సయ్యద్ జీనత్, సయ్యద్ సమీనా, ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్, డాక్టర్ మహబూబ్, డాక్టర్ స్మిత ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నూర్, డాక్టర్ శ్రీవిద్య పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయండి

● కలెక్టర్‌కు వెనిగండ్ల గ్రామస్థుల వినతి

పెదకాకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్థులు శనివారం కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన విశ్రాంతి ఏఈ జొన్నల వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రజల అవసరాలు నిమిత్తం జాతీయ బ్యాంక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జాతీయలోక్ అదాలత్‌లో 246 కేసులు పరిష్కారం

తెనాలి క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా 246 కేసులు పరిష్కారమయ్యాయని 11వ అదనపు జిల్లా న్యాయాధికారి డి.శ్రీనివాసులు తెలిపారు. ఇందులో సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 220, ప్రీ లిటిగేషన్ కేసులు 3 ఉన్నాయి. రూ.4.35 కోట్ల మేర పరిహార మొత్తాన్ని బాధితులకు అందించామన్నారు. లోక్ అదాలత్ నిర్వహణకు రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, లోక్ అదాలత్ మెంబర్లు ఖాదర్ హుస్సేన్, పి.రమేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెండ్ అన్నం పిన్నారావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పొన్నూరులో 76 కేసులు..

పొన్నూరుటౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక సివిల్ కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 76 కేసులు పరిష్కారం అయినట్లు అధికారులు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, పొన్నూరు ఇన్‌చార్జి చైర్మన్, తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో రెండు సివిల్ కేసులు, 33 క్రిమినల్, 29 ఎక్సైజ్ కేసులతోపాటు పలు కేసులు పరిష్కరించారు. అదాలత్‌లో మెజిస్ట్రేట్ శ్రీధర్, అదాలత్ సభ్యుడు మగ్బుల్‌బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.జయరాజు, న్యాయవాదులు, కక్షిదారులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన అవసరం

తెనాలి రూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక ఆధునిక పరిజ్ఞానంపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. శనివారం మండలంలోని కొలకలూరులో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వారు వ్యవసాయంలో వస్తున్న మార్పులు, లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి సాగు విధానంపై పలు విషయాలను రైతులకు వివరించారు. అనంతరం కొలకలూరు గ్రామ పంచాయతీ పరిసరాల్లో పంట స్వరూపాన్ని తెలియజేసేలా రంగవల్లులతో గ్రామ స్వరూపాన్ని అందంగా గీశారు. ఎంపీటీసీ కాశిశెట్టి ఫణికుమార్, వీఏఏ నాగ గరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో ఫేర్‌వెల్ డే

తెనాలి అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ప్రొఫెసర్ విజయ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సోదర భావంతో మెలుగుతూ సీనియర్‌లకు వీడ్కోలు చెప్పడం ఆదర్శప్రాయమన్నారు. అనంతరం అధ్యాపకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

10న గుంటూరులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

కొల్లిపర, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీన గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను రైతులు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగి, వల్లభాపురం, అన్నవరంలంక గ్రామాల్లో రైతులను తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం పసుపు క్వింటా రూ.16 వేలు ఉండగా ప్రస్తుతం రూ.9,500లకు చేరుకుందన్నారు. మిర్చి రూ.32 వేలు ఉండగా రూ.11 వేలకు పడిపోయిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, అచ్యుత సురేష్, మాధవరెడ్డి, బొట్టు కోటిరెడ్డి, అవుతు రత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

కొల్లిపర, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి ఎస్.సుమంత్ అన్నారు. కొల్లిపరలో శనివారం వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు బాలింతలకు, చిన్నారులకు, రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు ప్రతిరోజు మందులను వేసుకోవాల్సిందేనన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్య సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కల్యాణి, ఏఎన్ఎం మణిమ్మ, హెల్త్ అసిసెంట్ శ్రీనివాసరావు, ఆషా కార్యకర్తలు, బి.కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రరాష్ట్రాన్ని తీర్చిదిద్దుకోవడమే మనందరి లక్ష్యం

● టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా నడవాలి
● కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
● ఎమ్మెల్సీ ఆలపాటి విజయోత్సవ సభ


సభలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు దీటుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి పనిచేస్తున్నాయని అందుకు అనుగుణంగా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణమండపంలో కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయోత్సవసభ నిర్వహించారు. ఆలపాటిపై ఎంతో ప్రేమ చూపుతున్న నియోజవర్గ ప్రజలకు పెమ్మసాని ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆలపాటిని ఎమ్మెల్సీగా గెలిపించేందుకు తనపై ఉన్న బాధ్యతను నెరవేర్చానని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మరో 15ఏళ్లు పనిచేయాల్సి ఉందని అప్పుడే రోడ్లు, పరిశ్రమలు, ప్రాజెక్టులు వంటివి అన్ని సమకూరగలవన్నారు. అందుకు కుల,మత, రాజకీయాలకు తావు లేకుండా అంతాసమానమన్న భావనతో మూడు పార్టీల శ్రేణులు పనిచేయాలన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ ఆలపాటి గెలుపుకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయడం ఐక్యతకు నిదర్శనంగా నిలవడంతో పాటు ఆలపాటి భారీ మెజార్టీతో గెలిచారని అందుకు ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మాజీ మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ వంటి మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడు పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తాడని విద్యార్థినాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఆయన అనుభవం పట్టభద్రులకు మరింత మేలు చేస్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు ఘన విజయాన్ని అందించిన పట్టభద్రులకు కూటమి నాయకులు, కార్యకర్తలకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపుతున్నానన్నారు. పొత్తుల ధర్మంలో భాగంగా తనకు తెనాలి సీటు దక్కలేదని కేడర్ ఎంతో నిరాశ పడిందని ఆ సమయంలో తాను కూడా కొంత బాధపడ్డానని అన్నారు. రాష్ట్రం కోసం పార్టీ నాయకత్వం ఆదేశాలను గౌరవించి కూటమి విజయానికి పనిచేసి ఘన విజయం సాధించామన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ తన విజయం కోసం తీవ్రంగా కృషి చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజవర్గంలో టీడపీ, జసేన, బీజేపీ పార్టీల వారందరూ కలిసికట్టుగా ఉంటూ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేలా ముందుకు సాగాలని కోరారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం మహిళల ప్రగతిని మరింతగా పెంచేలా పాలన సాగిస్తుందన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీనాయుడు, పిల్లి మాణిక్యాలరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, కరిముల్లా కూటమి శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్రసహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డు నుండి పాలడుగు సురేంద్ర, పలువురు నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుర్రపు బండిపై వారిని పూల జల్లులు కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.



గుర్రపుబండిపై ఆలపాటి, పెమ్మసానికి ఘన స్వాగతం పలుకుతున్న సురేంద్ర, పార్టీ నాయకులు

ఎమ్మెల్సీ ఆలపాటికి ఘన స్వాగతం...

తెనాలి మారీసుపేట, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా గెలుపొంది తొలిసారి తెనాలికి విచ్చేస్తున్న ఆలపాటిరాజేంద్రప్రసాద్‌ను కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం మండలంలోని సంగంజాగర్లమూడి నుండి ఆలపాటి విజయ యాత్ర ప్రారంభమైంది. వేలాదిమంది కూటమి నాయకులు, కార్యకర్తలను చూసిన ఆలపాటి వారికి అభివాదం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తొలుత గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపి అంగలకుదురుకు చేరారు. అక్కడ మసీదులో మతపెద్దల ఆశీస్సులు తీసుకుని ప్రత్యేకప్రార్థనలు చేశారు. దారిపొడవునా పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలు జల్లుతూ, మహిళల హారతులిస్తూ సభా ప్రాంగణం వరకూ ఆలపాటికి ఘన స్వాగతం పలికారు.


డంపింగ్ యార్డు వద్ద మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

స్వచ్ఛ పొన్నూరుకు సహకారం అందించాలి

కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరును స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణ వాసుల సహకారం అవసరం అని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద శనివారం మొక్కలు నాటారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ పురపాలక సంఘం నుంచి దశాబ్దాల తరబడి డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే 50 శాతం చెత్త తొలగింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. రానున్న రోజులలో డంపింగ్ యార్డులో చెత్త సెగ్రిగేషన్ చేసి చెత్త నుంచి సంపద సృష్టించనున్నట్లు చెప్పారు. చెత్త నిల్వ చేసే డంపింగ్ యార్డును సుందర వనంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఢిల్లీలో జరిగిన సదస్సుకు హాజరైన వల్లభరావుపాలెం సర్పంచ్ భ్రమరాంబ

ఢిల్లీ సదస్సుకు వల్లభరావుపాలెం సర్పంచ్

పొన్నూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూ ఢిల్లీలో ఈ నెల 4, 5 తేదీలలో జరిగిన జాతీయ వర్క్‌షాపునకు మండల పరిధిలోని వల్లభరావుపాలెం సర్పంచ్ వేజెండ్ల భ్రమరాంబ హాజరయ్యారు. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ వర్క్‌షాపునకు రాష్ట్రం నుంచి 25 మంది ప్రజా ప్రతినిధులు ఎంపిక కాగా తెనాలి డివిజన్ నుంచి వల్లభరావుపాలెం సర్పంచ్‌కు ప్రాతినిధ్యం లభించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళ ప్రజా ప్రతినిధుల సమక్షంలో జరిగిన సదస్సులో మహిళ విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఆర్థిక స్వాలంబన, భద్రత సౌకర్యాలు తదితర అంశాలపై జరిగే చర్చలలో పాల్గొన్నట్లు సర్పంచ్ భ్రమరాంబ తెలిపారు.

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి

యానాది సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య


సమావేశంలో మాట్లాడుతున్న యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య

పొన్నూరు టౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని యానాది సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామంలో శనివారం యానాది సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10 లక్షల యానాది జనాభా ఉందన్నారు. యానాదులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నందున ప్రత్యేక వర్గీకరణ అవసరం ఉందన్నారు. ఎస్టీ వర్గీకరణ సాధించేందుకు ఏప్రిల్ 14న నెల్లూరులో వర్గీకరణ భేరీ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా చైర్మన్‌గా కొమరిగిరి చెంచయ్య, అధ్యక్షుడిగా బాకుల మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా అద్దూరి బాలకృష్ణ, మహిళ కమిటీ చైర్మన్‌గా జున్ను కళ్యాణి, అధ్యక్షురాలిగా శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా చేవూరి కృష్ణవేణి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికారి ప్రతినిధి బాపట్ల బ్రహ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నూరు అంకమ్మరావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా బ్రహ్మోత్సవాలు

కొల్లిపర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శనివారం పండితులు బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాధ శర్మ, జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృథ్వీబాబు, వీరభద్రేశ్వరశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, నాగరాజుశర్మ స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన, పుణ్యాహవచన వంటి పూజలు చేసిన అనంతరం చంద్రప్రభ వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించడంతో భక్తులు హారతులు ఇచ్చి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. నూతక్కి వారిచే శ్రీ సీతారామాంజనేయ భక్తి సమాజం ఆధ్వర్యంలో మహిళలు కోలాటం నిర్వహించారు.


కొల్లిపరలో శ్రీజనార్దనస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక ● ఘనంగా మహిళా దినోత్సవ కార్యక్రమాలు

తెనాలి, మారీసుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలో మహిళలు సత్తా చాటాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో మునిసిపల్ కౌన్సిల్ హాల్ నందు మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళల కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుంటూ అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. విద్య ఉద్యోగం సామాజిక రాజకీయ రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. అనంతరం మునిసిపల్ మహిళా ఉద్యోగులు చైర్‌పర్సన్ రాధిక కమిషనర్ శేషన్నను దుశ్శాలవాతో సత్కరించి పూలమాలలు వేసి అభినందించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శేషన్న, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మిలావణ్య, వీ విజయలక్ష్మి, మున్సిపల్ అధికారులు, అవుట్‌డోర్‌అండ్‌ఇన్‌డోర్ సి బ్బంది, మెప్మా సీఎంఎం, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక పక్కన కమిషనర్ శేషన్న, వైస్‌చైర్ పర్సన్ నాగవేణి తదితరులు

● తెనాలి అర్బన్, (ఆంధ్రజ్యోతి): జేఎంజే మహిళా కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి వాణిజ్యపన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ సువర్ణరాణి కేక్ కట్ చేసి విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షైనీ, అరుణసుజాత, పాటిబండ్ల హేమలత, సరోజిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ, మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. అన్ని రంగాల్లో మహిళలు తమదైన శైలి చూపుతున్నారని ప్రపంచం కూడా మహిళా శక్తిని గుర్తించిందన్నారు. అధ్యాపకులు షీలా, కాత్యాయిని, దేవిప్రియ ప్రసంగించారు. ఎఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థినులకు ఫ్యాషన్ షో, నృత్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరమణ, నందగోపాల కృష్ణ, భార్గవి పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో వేములపల్లి సుజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయవాది జగదీశ్వరాంబ, వైద్యురాలు జీవనలతను ఘనంగా సన్మానించారు. విశ్రాంత అధ్యాపకురాలు అరుణ ప్రభ, లక్ష్మీదేవి, బుల్లిమ్మ, రోహిణి తదితరులు పాల్గొన్నారు. ఐతానగర్‌లోని రక్షణ సైన్యం చర్చిలో లెఫ్టినెంట్ సీయోను కుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. తొలుత పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేపట్టారు.



పీబీఎన్ కళాశాలలో జరిగిన మహిళ దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

ఘనంగా మహిళ దినోత్సవం

పొన్నూరు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని పీబీఎన్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దంత వైద్య నిపుణులు డాక్టర్ డీఎస్ తేజ మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా బలంగా ఉంటే కుటుంబ భవిష్యత్ బాగుంటుందన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ ఎన్‌పవర్‌మెంట్ కన్వీనర్ సుజన, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఐలాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. మహిళ దినోత్సవ విశిష్టత, మహిళలకు ఉన్న హక్కులు వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎద్దు శామ్యూల్ రాజ్, పి.సుధాకర్, మన్నెం కిశోర్, తోడేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు ఆర్‌వీఐటీ కళాశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయవాది దార్ల అనుపమ మాట్లాడుతూ యువతులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతికత అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్వీ కృష్ణయ్య, ప్రెసిడెంట్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని సర్పంచ్ పిల్లి రాధిక అన్నారు. కొల్లిపర పంచాయతీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ రాధిక మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన మహిళలను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవ్, పంచాయతీ కార్యదర్శి అలకనంద, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాధిక

సిబార్‌లో ఘనంగా మహిళ దినోత్సవం


డాక్టర్ జయ దీప్ మహేంద్రను సత్కరిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ రేవతి, డాక్టర్ సమతా తదితరులు

పెదకాకాని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్థోడాన్టిక్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జయదీప్ మహేంద్ర మహిళలు అన్ని రంగాలలో సాధిస్తున్న ప్రగతిని వివరించారు. సమావేశంలో డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు డాక్టర్ రేవతి మాట్లాడుతూ తల్లిగా, చెల్లిగా, వ్యాపారవేత్తగా మహిళలు సాధిస్తున్న ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి కృష్ణమోహన్, డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ సమత, డాక్టర్ నగేష్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఇంజనీర్ ఇన్ చీఫ్ మరియన్న, శేషన్న తదితరులు

నీటి శుద్ధిప్లాంట్ పరిశీలన

తెనాలి మారీసుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న మురుగి నీటి శుద్ధి ప్లాంట్‌ను పురపాలక ఇంజనీర్ ఇన్ చీఫ్ మరియన్న శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనుల గురించి అధికారులు, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఏఈ శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.